INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:3(1), March:2021
Online Copy Available: www.ijmer.in

# ఆముక్తమాల్యద - సంప్రదాయాలనిర్వహణ

**రాఘవేంద్ర రావు**
తెలుగు సహాయాచార్యులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
కూకట్ పల్లి

**పరిచయం**

శ్రీకృష్ణదేవరాయలు సాహితీ సమరాంగణ సార్వభౌముడు. సమరాంగణ సార్వభౌముడు అని చెప్పడానికి విజయనగర సామ్రాజ్య చరిత్ర తార్కాణం కాగా సాహితీ సార్వభౌముడు అని చెప్పుటకు ఆముక్తమాల్యదయొకటి చాలు. శ్రీకృష్ణ దేవరాయలు కొన్ని సంస్కృత కృతులను రచించినప్పటికీ భగవద్వాక్యము ననుసరించి అతడు రచించిన ఆముక్తమాల్యద అతడిని తెలుగు కవులలో సార్వభౌమ స్థానమును అలంకరించుట సహకరించినది. నారికేళ సమన్వితమైన ఆముక్తమాల్యద తెలుగు పంచ మహా కావ్యాలలో ఒకటిగా వాసికెక్కింది.

"ఆముక్తమాల్యద అనగా అర్థమేమి? మనుచరిత్రము, వసుచరిత్రము, పాండురంగ మహాత్మ్యం అనగా కొంత వరకు తెలియుచున్నది .ఇది ఏమి తెలియుటలేదు. ఇది ఇది గొప్ప పుస్తకం అని చెప్పుచున్నారు. దీనికి అర్థం ఏమి?' ఆముక్త' అనగా అలంకరించుకోవడం. 'మాల్య' అనగా పూదండ.'ద ' అనగా ఇచ్చునది అని అర్థము. అనగా ఒక భక్తురాలు పూలదండను గ్రుచ్చి మొదట తాను అలంకరించుకుని తరువాత భగవంతుని మెడలో వేస్తుంది. ఈ పుస్తకంలో కథానాయిక ఆమే. ఇది ఆమె యొక్క కథ"- అని విశ్వనాథ సత్యనారాయణ గారు ఆముక్తమాల్యద గురించి ఒక పీఠికలో తెలియజేశారు. ఆముక్తమాల్యద కొన్ని ప్రతులలో ఆరు ఆశ్వాసములు గాను మరికొన్నిటిలో ఏడు ఆశ్వాసములు గాను విభజింపబడి ఉన్నది. ఇది వావిళ్ళ వారి ప్రతి లో ఆరు ఆశ్వాసములుగా, వేదము వేంకటరాయ శాస్త్రి గారి ప్రతి లో ఏడు ఆశ్వాసములుగా విభజింపబడి ఉన్నది.

గతం నుండి పాటిస్తూ వస్తున్న ఒక నిర్దిష్టమైన పద్ధతిని సంప్రదాయం అంటారు. అనగా పరంపరగా వచ్చేదని అర్థం. ఇది వంశపు తీరు కావచ్చు, గురు పరంపర మరేదైనా కావచ్చు. సంప్రదాయమునకు చెందిన వాటిని సాంప్రదాయికములు అంటారు. ఇట్టి ఘట్టములు ఆముక్తమాల్యద లో ఎక్కడెక్కడ కనబడినవో పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశం.

**అవతారిక**

ఆముక్తమాల్యద కృత్యావిర్భావమే సాంప్రదాయక పద్ధతిలో సాగినది. శ్రీకృష్ణదేవరాయల చింతన వైష్ణవ భక్తి. వైష్ణవ సంప్రదాయం అవతారికలో స్పష్టంగా కనబడుచున్నది. ఇష్టదేవతా స్తవము నుండి అనంత, గరుడ ,విశ్వక్సేన పరివారములు, పాంచజన్య, నందక, కౌమోదకి, సుదర్శన స్తుతులు, పన్నిద్దరు ఆళ్వారుల ప్రస్తుతి.ఇది వరుస క్రమము - వైష్ణవ కృతి సంప్రదాయము. ఇక భగవంతుని స్వప్న సాక్షాత్కారము ప్రాచీన కవి సంప్రదాయం.

**విలుబుత్తూరు : జనజీవన వర్ణన**

కథా ప్రారంభం శ్రీవిలుబుత్తూరు వర్ణనతో మొదలవుతుంది. నగర వర్ణన ప్రాచీన కావ్యాలలో వలెనే ఉంటుంది. నగర స్త్రీలు, వారి వర్ణన శ్రీనాథుని శైలిని పోలి ఉంటుంది. కానీ విలుబుత్తూరు నగర స్త్రీల వర్ణనలో శ్రీ కృష్ణ దేవరాయలు ఆనాటి సాంప్రదాయిక జీవన విధానాన్ని

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:3(1), March:2021
Online Copy Available: www.ijmer.in

విస్తరించారు. నగర స్త్రీలు ఉద్యానవనంలోని కొలను లకు వెళ్లి తలారా స్నానం చేసి,పసుపు పూసుకుని, చంకలో పెట్టుకొని అక్కడ దొరికిన పద్మములను నాభిని దోపుకుని దైవ పూజకు తీసుకుని రావడం కుటుంబీకుల జీవన విధానాన్ని వివరిస్తుంది .స్నాన సమయంలో పూసుకున్న పసుపు ముతకగా కాకుండా బట్టలతో తుడుచుకుని, కనుబొమ్మల మధ్య ఖాళీ లేకుండా బొట్టు దిద్దుకోవడం ఇవి స్త్రీల జీవన సంప్రదాయాలు. విష్ణు భక్తులు కనిపించినప్పుడు భక్తిపూర్వకంగా నమస్కరించడం నాటి గౌరవ సంప్రదాయం .సాయంకాలపు వేళ లో నానా రకాల పక్షులు వాటి గూళ్ళకు చేరే సమయంలో నగర కాంతలు తలకు అగరు నూనెలు పూసుకుని జుత్తుసవరించుకుంటూ సాయంకాలం వేళల్లో చీకటి పడకముందే జడ వేసుకోవడం సంప్రదాయం. చీకటి పడ్డాక జుత్తు దువ్వుకోవడం,విరబోసుకోవడం నిషిద్ధం. అదే వేళలో పల్లెటూరి పడుచు వేప గంపల లో కట్టిన పూలు తెచ్చి వీధుల వెంట అమ్మేవారు. వారి రాక కోసమే ఎదురు చూస్తున్న గృహిణులు వాటిని కొనుక్కుని తలలో తురుము కొంటారు. ఇది దైనందిన జీవన సూచిక

గృహస్తులు అతిథి అభ్యాగతులను ఆదరించడం భారతీయ సంప్రదాయం. “అతిథిదేవోభవ” అని శాస్త్రం చెబుతోంది. విలిబుత్తూరు లోని గృహస్తులు అతిథి సేవలో నిష్ణాతులు. అతిథి అభ్యాగతులను ఆదరించడం, వారికి ఎదురెళ్లి సాష్టాంగ ప్రణామాలు చేసి, కాళ్లు కడిగి ఇళ్లకు తీసుకు వచ్చేవారు. కొబ్బరాకుల చాపలు వేసి కూర్చోబెట్టే వారు. లేత అరిటాకులలో భోజనం వడ్డించేవారు. ఆ భోజనాలలో సన్నబియ్యం, చారు, నెయ్యి, కూరలు ,పాలు, పెరుగు ధారాళంగా వడ్డించేవారు. భోజనానంతరం తాంబూలాన్ని ఇచ్చేవారు. నానా దేశాల విశేషాలు అడిగి తెలుసుకునేవారు. ఇది మనకు విలిబుత్తూరు నగరంలో కనబడుతుంది. ఈ విధంగా కుటుంబినులు పూజా కైంకర్యాలకు వలసిన నీటిని, పుష్పాలను అందించడం వారి స్త్రీల ధర్మం కాగా అతిథులను సమాధానంగా తృప్తిపరచడం గృహస్తుల పని. ఇది సాంప్రదాయిక జీవనశైలి

**విష్ణుచిత్తుని జీవనం**

విష్ణుచిత్తుడు అద్వైత భావంతో ఉత్తమ జీవితం గడుపుతూ భగవతద్భక్తులకు సకల పరిచర్యలు, మర్యాదలు జరుపుతూ దేవాలయంలోని రథాలకు దేవుని కర, చరణాలకు తులసి దళం మాలలను అలంకరిస్తూ జీవనం సాగిస్తూఉంటాడు. ఇది సాధారణ భక్తుని జీవన విధానం

అతడు ధర్మబద్ధంగా , న్యాయంగా సంపాదించిన సొమ్ముతో వైష్ణవ బ్రాహ్మణులకు, యువబ్రహ్మచారులకు, బాటసారులకు సంతర్పణ చేస్తూ ఉండేవాడు.

వర్షాకాలంలో ఎండు కట్టెలు లభించవని, వంటకు కష్టమవుతుందని గుర్తించి ముందుగానే కొబ్బరి బోండాల పీచు, ఎండు కొబ్బరి మట్టలు జాగ్రత్తగా తడవకుండా నిలువ ఉంచేవాడు. జడివానలు కురిసినా అతిథి అభ్యాగతులకు పప్పు, పరమాన్నం, వేపుడు కూరలు, వడియాలు, నెయ్యి, పెరుగు ల తో విందులు చేసే వాడు.

వేసవిలో అతిథులకు శరీరాలకు పూసుకోవడానికి మంచిగంధం ఏర్పాటు చేసేవాడు. నులివెచ్చని అన్నం, తీయని చారు, చెరుకు రసం, పలుచని అంబలి ,తీయని రసాన్నిచ్చే పళ్ళు, చల్లని నీరు, మామిడి పిందెల పచ్చళ్ళు, మజ్జిగ సమృద్ధిగా వడ్డించేవారు.

శీతాకాలంలో అతిథులకు పునుగు పూసి,మిరియాల పొడితో వేపుళ్లు చేయించి, చట్టి చుయ్యి మంటూండగానే వేడివేడిగా వడ్డించేవారు. పడిశం వదిలేట్టుగా ఆవకాయ పచ్చళ్ళు, పాయసాన్నం, ఊరగాయలు, చెయ్యి చురుక్కుమనేట్టుగా నెయ్యి, వేడిపాలు వడ్డించేవారు. ఇవి ఆయా ఋతువులలో తినవలసిన ఆహార పదార్థాలు. సాంప్రదాయిక ఆహార జీవనంలో ఆయా ఋతువుల్లో ఇలాంటి ప్రతిపాదనలు ఉంటాయి. వంటలలో కూడా సాంప్రదాయికత కనబడుతుంది. అంతేకాక విష్ణుచిత్తుని ఇంట్లో నూనెలు బానల నిండా , గోనెల

నిండాపిండ్లు, దండెం నిండా అంగవస్త్రాలు ఉండేవి. అతిథులు వంటినిండా నూనె పట్టించి సువాసనలతో నలుగు పిండి ని నలుగు పెట్టి అంగవస్త్రాలు కట్టుకొని కొలనుకు వెళ్లి స్నానం చేసి వచ్చేసరికి విందు భోజనం సిద్ధంగా ఉండేది. అభ్యంగన స్నానం అంటే ఒంటికి నూనె పట్టించి నలుగు పెట్టి స్నానం చేయడం. ఇది సాంప్రదాయిక స్నాన విధానం. అర్ధరాత్రి వరకు విష్ణుచిత్తుని ఇంట్లో పురాణ పారాయణ - దైవ సంకీర్తనలు వినిపించేవి. ఇది సంప్రదాయిక భక్తులు జీవనశైలి.

మధురానగర వర్ణన సాధారణ నగరాల వర్ణనలానే ఉంటుంది .నగర వీధులన్నీ విశాలంగానూ రేఖా కారంగాను ఉంటాయ ఆయా వృత్తులు- ఆయా వర్ణాల జీవన విధానాలకు అనువైన నిర్మాణం ఉంటుంది. నగర వర్ణనలో శ్రీ కృష్ణ దేవరాయలు ప్రాచీన కవులు సాంప్రదాయిక వర్ణనలను అధిగమించ లేదు. కానీ, నగర కాంత ల విషయంలో మధురానగరం కానీ, విలుబుత్తూరు కానీ సంప్రదాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు కనబడుతుంది. నగర కాంతల వర్ణనలలో శ్రీనివాసులు శ్రీనాథుని మార్గంలో నడిచినా, విష్ణు భక్తుడు కాబట్టి అతడు వారిలో దైవిక సాంప్రదాయాలను చూశాడు. మధుర స్త్రీలు తళతళ మెరిసే కంచంలో ముఖం చూసుకుంటూ కాటుక పెట్టుకోవడం, పునుగు పూసుకోవడం, లేచినజుత్తుముడిన ఉదయించే సూర్యుని వంటి పూల చెండు అలంకరించుకోవడం వంటి అలంకరణ సంప్రదాయం నేటికీ కనబడుతోంది.

**పుష్పలావికల చాతుర్యం**

మధురానగరం లోని పుష్పలావికల చమత్కారపు మాటలు వర్ణించలేని ఆనందాన్నిస్తాయి. నగర యువకుల సంభాషణ నర్మగర్భంగా ఉన్నా వారు దానికి తగిన ప్రతి సమాధానం ఇస్తూ తమ వ్యాపారానికి ఆటంకం కలగనట్లుగా ప్రవర్తిస్తారు. ప్రణయ భావాలు రేకెత్తించే చమత్కార సంభాషణల తో యువకులను వివశులను చేస్తూ పూల దండలు అమ్ముతుంటారు. వారి మాటలు, హావభావాలు, చూపులు, చేష్టలు యువకుల మనసులను కట్టిపడేసేవి. వారిని ఒక మెట్టు దిగేట్టు గా చేసి తమ పూలు కొనేటట్టు గా చేస్తారు. ఇది వారి జీవన శైలి. ఇక్కడ వ్యాపార విషయంలో ఎదుటి వ్యక్తుల మానసిక స్థితిపై ప్రభావాన్ని చూపించి వస్తువులు అమ్ముకోవడం కనబడుతుంది. ఇది సాంప్రదాయిక వ్యాపార రహస్యం. ఇక్కడ వారు తమ శీలానికి భంగం కలగకుండా కేవలం వ్యాపార ఉద్దేశం తో చేసే పనులు ఆహ్లాదాన్నిస్తాయి.

మధుర నగరం లోని చాతుర్వర్ణాల జీవనము సాంప్రదాయికంగానే సాగుతుంటుంది బ్రాహ్మణులు నిత్యాగ్నిహోత్రం, యజ్ఞయాగాలు చేసేవారు.. సాక్షాత్తు అగ్నిదేవుడు వారి ఇళ్ళల్లో కాపురం ఉంటున్నాడు వారు చేయి చాచి అడగరు. రాకుమారులు వారికి యుద్ధ కవచం అక్కరలేదు. అసహాయ శూరులు. భుజబలం, బుద్ధిబలాన్ని గౌరవిస్తారు. వైశ్యులకు పట్టిందల్లా బంగారమే. కోట్లకు పడగలెత్తిన వారు కుబేరుల్లా ఉంటారు. శూద్రులు భుజాలమీద నాగళ్ళు మో సుకొని పొలాలు దున్ని, కొండంత ధాన్యరాశులు పండిస్తారు. రాజుల విజయరేఖలు, శూద్రులునాగళ్ళ రేఖలవల్ల రాజ్యం సుభిక్షంగా ఉంటుంది.

**పరదేశి బ్రాహ్మణుడు**

పరదేశి బ్రాహ్మణుడు అంటే దేశాటనం చేస్తూ ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సంచారం చేసే వాడు. అతడు దొరికిన చోట ఆహారాన్ని స్వీకరించి అనువైన చోటసేదతీరుతూ సంచరిస్తూ ఉండే బ్రాహ్మణుడు. మధురానగర వైభవ విశేషాలను చూస్తున్న పరదేశి బ్రాహ్మణునికి రాజ పురోహితుల ఇంట్లో ఆశ్రయం లభిస్తుంది .అక్కడ ఆతిథ్యాన్ని అందుకుంటాడు. పరదేశి బ్రాహ్మణుని సత్కరిస్తారు. అతని కి ఇచ్చిన సాంప్రదాయిక ఆతిథ్యాన్ని చూడండి. అతనికి షడ్రసోపేతమైన భోజనం పెట్టడం అతిథి సంస్కారం. అటువంటి

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:3(1), March:2021
Online Copy Available: www.ijmer.in

సంప్రదాయం ఇక్కడ కనబడుతుంది .ఆయనకు ఆహారంగా పండిన చక్ర కేళీలు, లావుపాటి పనసతొనలు, నెయ్యి పంచదార కలిపి చలిమిడి పిండి, రకరకాల మామిడి పండ్లు,ఆవు పాల పాయసం, పొట్టులేనివడపప్పు, దానిమ్మ గింజలు, చెరుకు ముక్కలు, పానకం ఇవి ఆహారపదార్థాలు. భోజనానంతరం పచ్చ కర్పూ రపు తాంబూలాన్ని ఇవ్వడం సంప్రదాయం. తదనంతరం అతనికిసేదదీ రేందుకు ఏర్పాట్లు చేయడం ఆనవాయితీ .ఆ విధంగానే భోజనానంతరం తన గుడ్డసంచిని తలగడగా పెట్టుకొని వెన్నెలలో పడుకున్న అతిథిని పలకరిస్తూ అతడు సందర్శించిన ప్రాంతాల విశేషాలను తెలుసుకుంటూ ఉంటారు. ఇది మనకు విలిబుత్తూరు నగరంలో కూడా కనబడుతుంది., నాటి కాలంలో దేశ సంచారం దుస్సాధ్యమైన విషయం కాబట్టి ఆయా ప్రాంతాలను చూసిన వ్యక్తుల నుండి విశేషాలు విని,వాటిని ఊహించు కొని తాము వాటిని సందర్శించినట్లు భావించుకునే వారు. ఆతిథ్యం స్వీకరించిన చోట వారికి తన విశేషాలను చెప్పడం అతిథి యొక్క ధర్మం. ఇవి మనకు ఆముక్తమాల్యదలో విరివిగా కనబడతాయి.

పాండ్యరాజు అయినా మత్స్యధ్వజుని పూర్వీకుడు ఒకరు శివ భక్తుడు విష్ణు భక్తులను నిరసించే వాడు. కానీ అతని భార్య విష్ణు భక్తురాలు. ఆమె చేసే ఉపవాసాలు విష్ణు వ్రతాలు సంప్రదాయ జీవన శైలికి ఒక మచ్చుతునక. దశమి నాడు ఒక్క పూట భోజనం చేసి, ఏకాదశి నాడు పూర్తిగా ఉపవాసం చేసేది. ఆ రాత్రంతా హరికథలు చదువుకుంటూ జాగరణ చేసేది. ఇది ద్వాదశినాడు పారాయణం చేసి భోజనం చేసేది. ఈ మూడురోజులు భర్తకు దూరంగా ఉండేది. ఇది ఇది ఏకాదశి వ్రతాచరణ సంప్రదాయం. శ్రీ కృష్ణ దేవరాయలు విష్ణు భక్తుడు. విష్ణువుకు ప్రియమైన ఏకాదశి వ్రత విధానాన్ని వివరించాడు. ఇది నేటికీ విష్ణు భక్తులు పాటిస్తున్న ఏకాదశి వ్రత విధానం.

**గోదాదేవి**

ఆముక్తమాల్యద కథానాయిక అయిన గోదాదేవి దైవారాధనకు అవసరమైన ఏర్పాట్లను చేసే పద్ధతి సాంప్రదాయిక మైనది. ఆమె సూర్యోదయానికి ముందే లేచి సుగంధ ద్రవ్యాలు, బంగారు కలశం తీసుకుని స్నానం చేసేది. శుభ్రమైన తెల్లనిగుడ్డతో తడితుడుచుకునేది.తెల్లటి మట్టితో నొసటన గుమ్మడి గింజంత బొట్టు పెట్టుకొని, సింధూరంతో పొడవు గీత దిద్దుకునేది. నల్లటి వెంట్రుకలకు నూనె పోసి దూముడివేసుకుని,ధూపం వేసుకొని, పూలమాలలు పట్టుకొని గుడికి వెళ్ళేది., గుడికి పూజారి కంటే ముందు తానే వెళ్లి మండపాల మీద ముగ్గులు పెట్టి, తెల్లని దూదివత్తులు ప్రమిదలలో వేసి దీపాలు వెలిగించేది. అగరు ధూపం వేసి ఖండ శర్కర నైవేద్యం పెట్టి, నెయ్యితో దీపారాధన చేసి, అరటి పళ్ళు నివేదించి మొక్కేది. దేవాలయపు గర్భగృహం చుట్టూ ప్రదక్షిణం చేసేది. ఇది దేవాలయ దర్శన సంప్రదాయం.

**మాలదాసరి**

మాలదాసరి- కథలో గుడి కి దూరంగా నిలుచుని పాటలు పాడుతూ ఉంటాడు. గర్భగుడిలోనుంచి బయటకు వస్తున్న అభిషేక జలాన్ని ఎవడో ఒక శూద్రుడు చెంబులో పట్టి దాసరికి ఇస్తే అదే మహా ప్రసాదంగా స్వీకరించేవాడు. మాల దాసరులకు దేవాలయ ప్రవేశం ఆనాడు సాంప్రదాయిక జీవనంలో నిషిద్ధం. కాబట్టి దాసరికి గుడి ఆవరణలోకి అనుమతి లేదు. అతడికి శూద్రులు ఎవరైనా మిగిలిన ప్రసాదాన్ని ఇస్తే దానిని కళ్ళకు అద్దుకుని తినేవాడు.ఇది నాటి సంప్రదాయిక జీవనం.

**గోదాదేవి వివాహం**

గోదాదేవిని రంగనాథుడు దేవేరిగా స్వీకరించడం సాంప్రదాయిక వివాహ ఘట్టం గానే కనబడుతుంది. వధూవరులు తలంటు పోసుకోవడం, అక్షింతలు- జీలకర్ర బెల్లం -ముత్యాల తలంబ్రాలు- వివాహ తంతు ఇవన్నీ కూడా సాంప్రదాయికంగా కనబడతాయి.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:3(1), March:2021
Online Copy Available: www.ijmer.in

అరుంధతి దర్శనం చేసుకోవడం ఆ తర్వాత పురోహితులకు దక్షిణ తాంబూలాలు సమర్పించుకోవడం ఆనవాయితీ. వీటన్నింటిని ఆముక్తమాల్యదలో విపులంగా వర్ణించడం జరిగింది. శ్రీ కృష్ణ దేవరాయలు రాజు గానూ, కవిగానూ సమ న్యాయం చేశాడు. అతడు రాజ్యం లో జరుగుతున్న అన్ని వ్యవహారాలను నిశితంగా పరిశీలించేవాడు. కవి పండిత సభలో జరిగే చర్చలలో పాల్గొనేవాడు. కాబట్టి కావ్య నియమాలను, సాహితీ సంప్రదాయాలను, జీవన సంప్రదాయాలను, పౌర సంప్రదాయాలను పరిశీలించి కావ్యనియమాలను అనుసరిస్తూ అవసరమైన ప్రతిచోట ఆయా పాత్రలకు తగిన జీవన సంప్రదాయాలను ప్రతిష్ఠించాడు. సంప్రదాయాలకు భిన్నంగా వ్యవహరించిన పాత్రలు కనబడవు. వ్యాస విస్తృతి భీతి వలన వీటిని స్థాలీపులాకంగా గా పరిశీలించడం జరిగింది.

**ఉపయుక్త గ్రంథ సూచి**

1.ఆముక్తమాల్యద : వేదం వేంకటరాయ శాస్త్రి గారి సంజీవనీ వ్యాఖ్యానం
2.ఆముక్తమాల్యద : తుమ్మపూడి కోటేశ్వర రావు సౌందర్యలహరీ వ్యాఖ్యానం